మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
బుధవారం 07, అక్టోబర్ , 2026
తెలుగు డైలీ
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

# తెలంగాణలో పాదయాత్రల జోరు

## ప్రతీ పార్టీ నుంచి రోడ్డెక్కనున్న కీలక నేతలు

- 2027లో కేటీఆర్, కవిత పాదయాత్రలు
- రేవంత్ పాదయాత్ర కూడా ఉంటుందా?



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలు రాబోయే రోజుల్లో పూర్తిగా ప్రజల మధ్యకే పరిమితం కాబోతున్నాయి. సాధారణంగా ఎన్నికల సమయానికే పరిమితమయ్యే పాదయాత్రల సంస్కృతి, ఈ సారి వచ్చే ఏడాదే ప్రారంభం కానున్నాయి. ప్రతిపక్ష పార్టీలు క్షేత్రస్థాయిలో ప్రజల అసంతృప్తిని ఆసరాగా చేసుకుని అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిద్ధమవుతుంటే, దానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ప్రతిపక్షాల వ్యూహాలను తిప్పికొట్టేందుకు అధికార పక్షం కూడా సరికొత్త ప్రణాళికలతో రోడ్లపైకి వస్తోంది. ప్రతిపక్ష బిఆర్ఎస్ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కల్వకుంట్ల కవితలు పాదయాత్రలకు సన్నాహాలు చేసుకుంటున్నారు. వచ్చే ఏడాది తన పాదయాత్ర ఉంటుందని కేటీఆర్ ప్రకటించారు. కేటీఆర్ రాష్ట్రవ్యాప్త పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాలు, కాంట్రాక్టర్లు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను ఎండగట్టాలని భావిస్తున్నారు. తెలంగాణ రక్షణ సేన పేరుతో సొంత పార్టీ పెట్టుకున్న కవిత కూడా పాదయాత్రనే నమ్ముకుంటున్నారు. ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లి, సార్వత్రిక పోరు నాటికి కేడర్‌లో జోష్ నింపడమే ఈ ప్రతిపక్ష యాత్రల ప్రధాన లక్ష్యం. తన పార్టీకి క్యాడర్ ను కూడా పాదయాత్ర ద్వారానే పెంచుకోవాలని కవిత భావిస్తు_న్నారు. అయితే, విపక్షాలకు క్షేత్రస్థాయిలో ఎలాంటి పొలిటికల్ స్పేస్ ఇవ్వకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ శిబిరం పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ప్రజాపాలన విజయాలను, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. సీఎంకు తోడుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ వేర్వేరు ప్రాంతాలను విభజించుకుని ప్రభుత్వ మార్క్ సంక్షేమ ఫలాలను చాటిచెప్పేందుకు పాదయాత్రలు చేస్తారని అంటున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీ జనతా పార్టీ కూడా ఈ యాత్రల రేసులో ఏమాత్రం వెనుకబడటం లేదు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు స్థానిక సమస్యలు, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై దృష్టి పెడుతూ వేర్వేరు నియోజకవర్గాల్లో పాదయాత్రలతో రోడ్లపైకి వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు, సొంత ధోరణితో ముందుకు సాగుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ తనదైన శైలిలో నిర్వహిస్తున్న యాత్రలు కూడా సోషల్ మీడియాలో విపరీతమైన కవరేజ్ సాధిస్తున్నాయి.

## ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో 45.5 ఎకరాల వ్యత్యాసం.

### నివేదికపై సీఎం రేవంత్ ఆరా



**సిద్దిపేట, అక్టోబర్ 7:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325పై తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన భూసర్వే నివేదికపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఈ సర్వేలో మొత్తం 343 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు.. ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. గత రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 325లో 388.5 ఎకరాల భూమి ఉన్నట్లు నమోదై ఉండగా, తాజా సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇంకా 45.5 ఎకరాల భూమి వ్యత్యాసంపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలుస్తోంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న పట్టా భూములపై కూడా అవసరమైతే సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, రికార్డులను పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా నోటీసులు జారీ చేసి, ఫాంహౌస్ పరిధిలో ఉన్న భూములను కూడా సర్వే చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆధ్వర్యంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, మర్కూక్ తహసీల్దార్ సరితతో పాటు రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.సర్వే నంబర్ 325కు సంబంధించి పాత రికార్డుల్లో నమోదైన భూమి, ప్రస్తుతం సర్వేలో గుర్తించిన భూమి మధ్య ఉన్న వ్యత్యాసానికి కారణాలు ఏమిటన్నది ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన భూమి వివరాలను రికార్డుల ఆధారంగా అధికారులు పరిశీలించనున్నట్లు సమాచారం.

## కోట్లాది మంది భారతీయుల విశ్వాసమే

# నా అతిపెద్ద బలం



**న్యూఢిల్లీ :** 25 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ అందిస్తానని అప్పుడు ఊహించలేద ప్రధాని మోదీ అన్నారు. ప్రజా ఆశీర్వాద బలమే తనను ఇంతకాలం నడిపించిందని పేర్కొన్నారు. ప్రజలు అందించిన నిరంతర ఆశీస్సులు, విశ్వాసం వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆశీస్సులు అందించిన దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని మోదీ అన్నారు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తానన్నారు. ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రయాణాన్ని, ప్రజలతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసిన రోజులను ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. అప్పటివరకు ఎన్నుకోబడిన పదవిలో పనిచేసిన అనుభవం తనకు లేకపోయినా, ప్రజా జీవితంలో కీలక బాధ్యతలు చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. అప్పట్లో 25 ఏళ్ల పాటు ప్రభుత్వాధినేతగా కొనసాగుతానని తాను ఊహించలేదని మోదీ తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా పలు పర్యాయాలు పనిచేసిన తర్వాత 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి వరుసగా మూడు పర్యాయాలు దేశ ప్రధానిగా కొనసాగుతున్నారు. తన రాజకీయ ప్రస్థానంలో సాధించిన ప్రతి విజయానికి ప్రధాన కారణం ప్రజలేనని స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నా, అందులో కోట్లాది భారతీయుల విశ్వాసం కీలక పాత్ర పోషించిందన్నారు. పార్టీ కోసం కష్టపడిన లక్షలాది కార్యకర్తల శ్రమ కూడా తనకు ఎంతో బలాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని పాలనకు మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగినట్లు తెలిపారు.

## ఢిల్లీలో నిరసన.. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీపై

# ఎఫ్ఐఆర్ నమోదు



**న్యూఢిల్లీ :** సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా పలువురు నేతలు మంగళవారం ఢిల్లీలో ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళన నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా పలువురు నేతలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరంతా ఢిల్లీలోని ఆకాశవాణి భవన్ వద్ద నిరసన చేపట్టారు. అయితే, అనుమతి లేకుండా ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించారనే ఆరోపణతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.ఈ ఆందోళనలో పాల్గొన్న ఇతర ప్రతిపక్ష ఎంపీలు, కార్యకర్తలపై కూడా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సర్‌కు, జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ ఎంపీలు ఆకాశవాణి భవన్ వద్ద ఆందోళన చేశారు. దాదాపు ఎనిమిది గంటలకుపైగా.. 260 మంది వరకు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం మంగళవారం రాత్రి వీరందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం వోట్ చోరీకి పాల్పడిందని ఆరోపిస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు మంగళవారం నిరసనలకు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా పార్లమెంట్ భవనం నుంచి ఈసీఐ ప్రధాన కార్యాలయం వరకు పలువురు నేతలు ర్యాలీ చేపట్టారు. కానీ, వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో నేతలు ఆకాశవాణి భవన్ వద్ద నిరసనకు దిగారు. అయితే, వారి నిరసనలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్నారు. తాజాగా వారిపై కేసు నమోదు చేశారు.

## విశాఖలో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ప్రారంభం

### రూ.4,249 కోట్ల ప్రాజెక్టులకు భూమి పూజ




**విశాఖపట్నం, అక్టోబర్ 7:** ఉత్తరాంధ్ర వేదికగా విశాఖ ఐఐఎంలో 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. ఈరోజు(బుధవారం) కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీలు ఎం.శ్రీ భరత్, కలిశెట్టి అప్పలనాయుడు.. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీవీజు పాలసీ 4.0, ప్రభుత్వ రాయితీలు, రుణ సదుపాయాలపై పారిశ్రామికవేత్తలకు సీఐఐ సదస్సు అవగాహన కల్పించనుంది.'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యానికి అనుగుణంగా స్టార్టప్‌లు, పెట్టుబడిదారులను సదస్సు అనుసంధానించనుంది. ఈ సదస్సులో రూ.4, 249 కోట్ల విలువైన 30 ప్రాజెక్టులకు భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్‌ల ద్వారా 23,256 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 30 పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రాంతీయ సదస్సులో మరో 30 పరిశ్రమల ఏర్పాటుకు రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, సి.ఐ.ఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ నరేంద్ర కుమార్ శరణం, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ఎన్నికల జోష్..




**రాజన్న సిరిసిల్ల**
రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికల జోష్ మొదలైంది. పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో డిపోల వద్ద కార్మిక సంఘాలు ప్రచారం చేస్తున్నాయి. గత బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీలో గుర్తింపు సంఘాలను రద్దు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సుదీర్ఘకాలం తర్వాత ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ చేపట్టడం తో కార్మికుల్లో ఉత్సాహం మొదలైంది. ఓటర్లను ప్రస న్నం చేసుకునేందుకు యూనియన్లు, వ్యూహ, ప్రతి వ్యూహాలపై దృష్టిపెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపోలు ఉండగా 425 మంది ఓటు హక్కు కలిగిన కార్మికులు ఉన్నారు. ఇందులో సిరిసిల్లలో 207 మంది, వేములవాడలో 218 మంది ఉన్నారు. కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పారదర్శకంగా ఎన్నికల నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు రెండు డిపోల వద్ద మూడు కూటమిలుగా ఏర్పడిన యూనియన్లు ప్రచారం చేస్తుండడంతో సందడిగా మారింది.ఆర్టీసీలో రాష్ట్ర వ్యాప్తంగా చివరిసారిగా 2016లో కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ యూనియన్లను రద్దు చేయడంతో కార్మిక సంఘాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. కార్మికులకు అండగా ఉండే గొంతు మూగబోయింది.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

# 2 డీఏ మంజూరు చేస్తూ ఉత్వర్వులు




**హైదరాబాద్:** ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. రెండు డీఏలు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం నాడు 2 డీఏలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ జీతంలో పెంచిన డీఏ ఉద్యోగుల ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేసింది. 2024 జవనరి నుంచి ఉద్యోగుల డీఏ 37.31 శాతం, 2015 పే స్కేలు ఉద్యోగులకు డీఏ 81.72 శాతం , 2020 పేస్కేలు ఉద్యోగులకు డీఏ 40.04 శాతతం, 2016 పే స్కేలు ఉద్యోగులకు డీఏ 53 శాతానికి పెంచారు. 2006 పే స్కేలు ఉద్యోగులకు డీఏ 246 శాతా నికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. యూజీసీ, ఏఐసీఐఐ ఉద్యోగులకు సైతం ఈ వర్తించనున్నాయని అధికారులు తెలిపారు.

# సింగరేణి OC-5 భూసేకరణలో పరిహారం నొక్కేసే యత్నం!

**ధరణి ఆపరేటర్‌పై ముస్త్యాల రైతుల ఆరోపణలు.**
**భూమి లేకున్నా రికార్డుల్లో ఎకరాల కొద్దీ భూమి నమోదు.**
**సుమారు రూ.23.25 లక్షల పరిహారం కాజేసే ప్రయత్నం.**
**సింగరేణి =+-1 +వీను ఆశ్రయించిన బాధిత రైతులు.**



**రామగిరి, సెప్టెంబర్ 06:**
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో సింగరేణి ాజ-5 భూసేకరణ వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. తమకు చెందాల్సిన భూములు, పరిహారం ఇతరుల పేర్లపై నమోదు చేసి పరిహారం కాజేసే ప్రయత్నం జరుగుతోందని పలువురు బాధిత రైతులు ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు.ధరణి ఆపరేటర్‌పై ఆరోపణలు రైతుల ఆరోపణల ప్రకారం.. గతంలో మంథని, అనంతరం రామగిరి మండలాల్లో ధరణి ఆపరేటర్‌గా పనిచేసిన అవునూరి రవి ప్రస్తుతం కమాన్‌పూర్ మండలంలో ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ముస్త్యాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 378లో రవికి ఎలాంటి భూమి లేకపోయినప్పటికీ, ఆయన పేరుపై రెండు ఎకరాలు, ఆయన భార్య పేరుపై 20 గుంటల భూమిని సర్వేలో నమోదు చేయించుకున్నారని రైతులు ఆరోపించారు.అదేవిధంగా రెవెన్యూ అధికారుల సహకారంతో భూములు లేని మరికొందరి పేర్లపైనా భూములు నమోదు చేయించినట్లు వారు పేర్కొన్నారు. ఈ విధంగా సుమారు 10 ఎకరాల వరకు భూమిని అక్రమంగా రికార్డుల్లో నమోదు చేసి, సింగరేణి సంస్థ నుంచి అందే పరిహారం పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.రూ.23.25 లక్షల పరిహారంపై వివాదం
ాజ-5 భూసేకరణలో భాగంగా సింగరేణి సంస్థ నుంచి అందాల్సిన సుమారు రూ.23,25,000 పరిహారాన్ని అసలైన భూయజమానులకు కాకుండా అక్రమంగా పేర్లు నమోదు చేసుకున్న వ్యక్తులు పొందే అవకాశం ఉందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భూములకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి, వాస్తవ హక్కుదారులను గుర్తించి మాత్రమే పరిహారం చెల్లించాలని వారు కోరుతున్నారు.

బహిరంగంగా రీ-సర్వే చేయాలని డిమాండ్
ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అప్పట్లో నిర్వహించిన సర్వేలపై, వాటికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ అధికారులపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా అక్రమంగా భూములు నమోదు చేయించుకున్న వ్యక్తులు, వారి వెనుక ఉన్న బినామీలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, సింగరేణి అధికారుల సమక్షంలో, పత్రికా ప్రతినిధులు, ప్రజల సమక్షంలో బహిరంగంగా రీ-సర్వే నిర్వహించాలని రైతులు డిమాండ్ చేశారు. అక్రమంగా భూములు నమోదు చేసుకున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, అసలైన రైతులకు న్యాయం చేయాలని కోరారు.
=+-1 +వీకు రైతుల మొరఈ నేపథ్యంలో బాధిత రైతులు మంగళవారం సింగరేణి =+-1 జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. భూసేకరణ, సర్వే, పరిహారం చెల్లింపుల విషయంలో సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి న్యాయం చేస్తామని +వీ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. వాస్తవాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

# ఇసుక ట్రాక్టర్ ఢీ మహిళకు తీవ్ర గాయాలు



**ముదిగొండ అక్టోబర్ 7 ప్రజావాణి ప్రతినిధి**
మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన బొడ్డు జ్యోతి అనే మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. బుధవారం తన మనవరాలిని స్కూల్ బస్సు ఎక్కించిన అనంతరం రోడ్డు దాటుతుండగా మల్కాపురం వైపు నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఆమెను ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు వెంటనే ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ అధిక వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కౌలాస్ లో గ్రామసభ నిర్వహణ..



**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 07**
కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామంలో బుధవారం రోజున గ్రామసభ అలాగే సోషల్ ఆడిట్ సర్పంచ్ విద్య బలరాం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.. ఊరిలోని సమస్యలు అభివృద్ధి పనులపై గ్రామస్తులతో, అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యా బలరాం మాట్లాడుతూ... గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులందరూ ఐక్యంగా ఉంది ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రజలందరూ భాగస్వాములు అయితే గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లవచ్చు అని, పూరి అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. అనంతరం సోషల్ ఆడిట్ నిర్వహించారు.. ఉపాధి హామీ గురించి గ్రామస్తులకు ఏపీఓ తులసిరాం అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం నిరుపేదలకు చాలా మంచిదని కాబట్టి ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులకు వెళ్లాలని ఈ సందర్భంగా ఏపీఓ తులసి రామ్ అన్నారు. అలాగే ఉపాధి హామీ పేరు నమోదు లేకపోతే పేరు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.. సర్పంచ్ విద్యా బలరాం, ఉప సర్పంచ్ పూజారి గణేష్, ఏపీఓ తులసి రామ్, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, డిఆర్పి గంగాధర్, గంగరాజు, సర్పంచ్ కుమారుడు రాజేష్, విశ్వనాథ్ పంతులు, బొగ్గుల గంగాధర్, మంత్రి సాయిలు, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు..

# రాజరాజేశ్వరి కాలనీ నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు!

**ఈర్ల రాజు ముదిరాజ్ నివాసంలో బీజేపీ ముఖ్య నేతల భేటీ..**
**పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై విస్తృత చర్చ**



**అమీన్‌పూర్, అక్టోబర్ 7 (ప్రజావాణి):**
అమీన్‌పూర్ మండలంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ ముఖ్య నాయకులు కార్యాచరణపై దృష్టి సారించారు. అమీన్‌పూర్ మండల బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ స్వగృహంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్కూరి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా గౌడ్ తదితరులు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా అమీన్‌పూర్ మండలంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం, రాబోయే పార్టీ కార్యక్రమాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.ప్రజల్లోకి బీజేపీ.. సేవా కార్యక్రమాలు విస్తృతంజిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ అమీన్‌పూర్ మండలంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు. మోదీ సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా సేవా కార్యక్రమాలను గ్రామాలు, కాలనీల స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు.
ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వం, కష్టపడే కార్యకర్తల సమష్టి కృషితోనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలంలో పార్టీ విస్తరణకు జిల్లా పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి
రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.
జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్కూరి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని ఆత్మీయంగా స్వాగతించి పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని అన్నారు. కార్యకర్తల సమష్టి కృషితో అమీన్‌పూర్ మండలంలో బీజేపీకి మరింత ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. రాజరాజేశ్వరి కాలనీ నుంచి భారీగా చేరికలసమావేశం సందర్భంగా పటేల్‌గూడ శ్రీ రాజరాజేశ్వరి కాలనీకి చెందిన పలువురు ప్రజలు గోదావరి అంజిరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో చేరికలు జరగడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ రాజరాజేశ్వరి కాలనీ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. ప్రజల విశ్వాసమే తమ బలమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమం, సేవా స్ఫూర్తితో ముందుకు సాగుతోందని అన్నారు. మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అమీన్‌పూర్ మండలంలో ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో బీజేపీని ప్రజలకు మరింత చేరువ చేస్తామని తెలిపారు.రాబోయే రోజుల్లో అమీన్‌పూర్ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఈర్ల రాజు ముదిరాజ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్వగృహానికి విచ్చేసిన జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మహిళా నాయకురాలు మీనా గౌడ్ తదితరులను ఈర్ల రాజు ముదిరాజ్ దంపతులు నూతన వస్త్రాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.
కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కొండా లక్ష్మణ్ గుప్తా, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా గౌడ్, ఇతర మహిళా నాయకురాళ్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజరాజేశ్వరి కాలనీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి వార్డు సభ్యుల ఆర్థిక సహాయం



**కూసుమంచి, (ప్రజావాణి) అక్టోబర్ 7:**
పోచారం గ్రామపంచాయతీ సిబ్బంది కానుగుల ఉపేందర్ తమ్ముడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ వార్డు సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. వార్డు సభ్యులంతా కలిసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సలవాది గురుమూర్తి, ఉపసర్పంచ్ ముంగి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులను పరామర్శించి, కష్టకాలంలో వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పోలంపల్లి కమలహాసన్, కుక్క మంగమ్మ, ఇరుగు గురులింగం, దుబ్బరి జ్యోతి, కోలపూడి రమేష్, కంభం జోష్ణ, కంభం పిచ్చయ్య, బత్తుల నరేష్, వల్లపు కవిత తదితరులు పాల్గొన్నారు.

# బస్వాపూర్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సాక్షులు బూట్లు టై బెల్టుల పంపిణీ ..

**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 07**
కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని విద్యార్థులకు శ్రీమతి. వి. రమణ సురేష్ సర్పంచ్ గారి చేతుల మీద పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు బూట్లు సాక్స్ టై బెల్టుల పంపిణీ విద్యార్థిని విద్యార్థులకు సర్పంచ్ బూట్లు సాక్షులు స్వయంగా వారి పాదాలకు తొడిగి బూట్లు టైబెల్టులు సర్పంచ్ చేతులు మీదుగా అందించినారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్బుక్లు యూనిఫామ్ బట్టలు నాణ్యమైన మధ్యాహ్న భోజనం తో



పాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థిని విద్యార్థులకు బూట్లు సాక్షులు టై బెల్టులు అన్ని సౌకర్యాలు మన రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తుంది మన పాఠశాలలలో చిన్న చిన్న సమస్యలు ఏవి ఉన్నా మన గ్రామ పంచాయతీ పాలకవర్గం సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని పిల్లలు మాత్రం మంచిగా క్రమశిక్షణతో చదువులు చదివి పై స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు. జై చంద్. లాలయ్య సార్. పాఠశాల. ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు..

# విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ

**కూసుమంచి, అక్టోబర్ 7 (ప్రజావాణి):**
కూసుమంచి మండలంలోని చిన్న పోచారం( వెంకట్రాంపురం) గ్రామ  మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేసి, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోచారం గ్రామ సర్పంచ్ సలవాది గురుమూర్తి, ఉప సర్పంచ్ ముంగి వెంకన్న, గ్రామపంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఉపాధ్యాయురాలు రమాదేవి, వార్డు సభ్యులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు.





# చెండేగావ్ గ్రామంలో సర్పంచ్ లక్ష్మణ్ సమక్షంలో ఇంటింటికి ఇంకుడు గుంత.

**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 07**
కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని చెండేగావ్ గ్రామంలో బుధవారం రోజు ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు... ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ వారి సమక్షంలోనే ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ ఇంకుడు గుంట



ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడారు.. నీరు రోడ్లపైన రాకుండా ఉండాలంటే ఇంకుడు గుంటను ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి దోమల వలన ఇబ్బందులకు గురికాకుండా ఉంటామని కాబట్టి ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని సర్పంచ్ లక్ష్మణ్ గ్రామస్తులకు తెలియజేశారు.. కొంతమంది గ్రామస్తులు ముందుకు వచ్చి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటామని అన్నారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్ తోపాటు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వికాస్ రెడ్డి తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు..

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com